నేడు యథాతథంగా కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అందరూ జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకూ కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల స్థాయి ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో ఫిర్యాదులు అందచేయాలని కలెక్టర్ తెలియచేశారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు.

రేషన్.. పరేషాన్..

- కిలో రూ.22 చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు
- ధరలు పెరగడంతో ఒక్కసారిగా డిమాండ్
- విజిలెన్స్ దాడులు చేస్తున్నా మారని తీరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. దళారులు నేరుగా లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి మిల్లర్లకు ఎగుమతి చేస్తున్నారు. తాజాగా బియ్యం ధరలకు రెక్కలు రావడంతో రేషన్ బియ్యానికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. గతంతో కిలో రూ.15 చొప్పున కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రూ.22 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి తిరిగి బహిరంగ మార్కెట్‌లో రక రకాల బ్రాండ్ల పేరుతోవిక్రయాలు చేస్తున్నారు. రేషన్ బియ్యం మాఫియా పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. లోకల్‌గా సేకరించిన బియ్యంతో పాటు తెలంగాణ నుంచి రేషన్ బియ్యం కూడా ఇక్కడి మిల్లులకు సరఫరా జరుగుతున్నట్లు అధికారుల దాడులలో గతంలో వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. మిల్లులకు ఇలా చేరుతున్న బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి, తళతళలాడే తెల్లని తెలుపు వచ్చేలా పాలిష్ చేయిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బియ్యాన్ని వాహనాల మార్చి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలయత్నం అవుతున్నాయి.

లబ్ధిదారుల నుంచి రూ.22 చొప్పున కొనుగోలు

లబ్ధిదారుల నుంచి కేజీ రూ.22 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటింటికీ రేషన్ వాహనాల నిర్వహకులు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర తీసుకుని లబ్ధిదారులకు కోటా బియ్యాన్ని అందజేస్తున్నారు. కొన్నిసార్లు బియ్యం నాణ్యత లేకపోవటం, అనారోగ్యాలు రావడం వంటి కారణాల వల్ల చాలా మంది ఈ బియ్యాన్ని వినియోగించడం లేదు. ప్రభుత్వం సన్నబియ్యం అందజేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదు. పట్టణాల్లో రేషన్ బియ్యాన్ని ఇడ్లీ, దోశల పండి, అటుకులు తయారీకి వాడుతున్నారు. మినహా రోజు వారీ భోజనానికి వినియోగించడం లేదు. వరుసగా మూడు నెలల పాటు పిడిఎస్ బియ్యం తీసుకోకపోతే రేషన్ కార్డు రద్దు అవుతుందన్న భయంతో అందరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ వేసి కొన్నిసార్లు డీలర్లకే కిలో రూ.13 చొప్పున ఆ బియ్యాన్ని ఇచ్చేస్తున్నారు. ఇలా రేషన్‌కు వచ్చే బియ్యంలో రీసేల్ అవుతుండగా 80 నుంచి 85 శాతం వరకు మాత్రమే పేదలు తీసు కుంటున్నారు. ఈ బియ్యాన్నే డీలర్లు, లబ్ధిదారుల నుంచి వ్యాపారులు, దళారులకు కిలో రూ.25 చొప్పున రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం.

యథేచ్ఛగా బహిరంగ మార్కెట్లో విక్రయాలు

లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని యథేచ్ఛగా తిరిగి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. 50 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. మరో 50 శాతం లోకల్ మార్కెట్లో వివిధ బ్రాండ్ల పేరుతో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి. 25 కేజీల బస్తా రూ.1,250 నుంచి రూ.1,350 చొప్పున బియ్యం వ్యాపారులు తిరిగి విక్రయిస్తున్నారు. ప్రముఖ కంపెనీల బ్రాండ్ల పేరుతో సైతం కొన్ని సార్లు రీసైక్లింగ్ బియ్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలంలో బియ్యం ధరలు 25 కేజీల బస్తాపై రూ.250 నుంచి రూ.350 వరకూ ధరలు పెరిగిన విషయం విదితమే. దీంతో అత్యధిక మంది మధ్య తరగతి ప్రజలు తక్కువ ధరకు వస్తున్నాయని పాలిష్ చేసిన బియ్యాన్ని కొనుగోలు చేసుకుని వినియోగిస్తున్నారు. ఈ దందాతో దళారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున కూడబెట్టుకుంటున్నప్పటికీ, మధ్య, దిగువ తరగతి ప్రజలు ఆర్థికంగానూ, ఆరోగ్య పరంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా పంపిణీ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ శ్రమ్ కార్డ్‌పై కార్మికులకు అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

స్థానిక దేవీ చౌక్‌లో ఆదివారం అసంఘటిత రంగ కార్మికుల కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రకాష్ బాబు మాట్లాడుతూ నల్సా వారి 'అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ సేవల పథకం, 2015' ద్వారా అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. ఆయా కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు ప్రక్రియ సమీప వార్డు సచివాలయంలో సిఎస్‌సి సెంటర్స్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ పథకం కింద నమోదైన కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డు జారీ చేస్తారని తెలిపారు. ఇప్పటివరకూ తూర్పు గోదావరి జిల్లాలో ఈ-శ్రమ్ పథకం క్రింద 3,18,014 మంది కార్మికులు నమోదైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్ఎం.వల్లి , అధికారులు ఎం.లలిత కుమారి, షేక్ జబీన, టిఎస్.కార్తీక్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి ప్రకాశ్‌బాబు

ప్రి మెచ్యూర్ బేబీస్ సంఖ్య తగ్గించాలి

ప్రజాశక్తి - నల్లజర్ల

నెలలు నిండకుండానే పుడుతున్న పిల్లల సంఖ్యను తగ్గించాలని, శిశు మరణాలను నివారించాలని ప్రజతకు అవగాహనా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ వెల్లడించింది. ఆదివారం ప్రీ మెచ్యూరిటీ డే సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ మాట్లాడారు. నెల ముందు పుట్టే పిల్లల్ని వైద్య పరిభాషలో ప్రి మెచ్యూర్ బేబీస్ అంటారని, ఈ విధంగా పుట్టే పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మారుతున్న జీవనస్థితి వైరుధ్యంతో ప్రతి ఏడాదీ నెల ముందు జన్మించే పిల్లల సంఖ్య పెరుగుతోందన్నారు. వీరికి ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యల తీవ్రత ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతోందన్నారు. ఇటువంటి విషమ పరిస్థితుల్లో ప్రవేటు ఆసుపత్రుల్లో చేర్చి ఎంత ఖర్చు పెట్టినా ఆరోగ్యపరంగా వారి భవిష్యత్ ఎలా ఉంటుందో సందేహమే అన్నారు. ఇటువంటి దురదృష్టకర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విస్తత అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పోషకాహారలోపం, రక్తహీనత, బాల్య వివాహాలు వంటి వాటివల్ల ఈ దుష్పరిణామలు సంభవిస్తున్నాయన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణుల ఆరోగ్యం కోసం ప్రత్యేక వసతులతో కూడిన ఆధునాతన విభాగాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎపి వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ వెల్లడించారు. ఈ ఆధునాతన వసతుల గురించి వివరిస్తూ, ఆ సౌకర్యాలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సుఖవంతమైనదని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇవాంజలిన్ అశోక్

టిడిపి సభ్యత్వం కార్యకర్తలకు అండ

ప్రజాశక్తి-కడియం

టిడిపి సభ్యత్వం పార్టీ కార్యకర్తకు కొండంత అండ అని టిడిపి హెల్త్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, నాయకులు మార్గాని సత్యనారాయణ పేర్కొన్నారు. పొట్టిలంక వివర్స్ కాలనీలో కొత్తపల్లి శ్రీ రామ్ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ సంక్షేమ విభాగం ద్వారా కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, కార్యకర్తలు కుటుంబాలలోని విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందిస్తుందని, కార్యకర్తలు లేదా వారి కుటుంబ సభ్యుల ఉపాధికి సహకారం అందిస్తుందని తెలిపారు. మరణం చెందిన వారి మట్టి ఖర్చులకు తక్షణమే రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేస్తారని రవిరామ్ కిరణ్ తెలిపారు.

గాయపడిన చిన్నారికి సాయం అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

డాబాపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆదుకునేందుకు ఆర్థిక సాయం అందించిన వారి దయాగుణం మరువలేనిదని మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి గ్రామానికి చెందిన చిన్నారి పాటూరి తాప్పి ప్రమాదానికి గురై రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రూ.13,350 ఆర్థిక సాయం బాలిక తండ్రి నాగార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ మాట్లాడుతూ బాలికను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. దాతలు ముందుకు వస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక సాయం అందించే సమయంలో జోడాల వెంట సువర్ణ రాజు తదితరులు ఉన్నారు.

ఇపిఎస్ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంచాలి

ప్రజాశక్తి-గోకవరం

ఇపిఎస్ 95 విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బత్తుల మంగరాజు అన్నారు. ఆదివారం గోకవరంలో పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్స్ మాట్లాడుతూ ఇపిఎస్-95 పెన్షన్ స్కీమ్ 1995, నవంబర్ 16న ప్రారంభించారని, నేటికీ 29 సంవత్సరాలు పూర్తయినా ప్రభుత్వరంగ పరిశ్రమల్లో పని చేసిన కార్మికులు, ఉద్యోగులకు మినిమం పెన్షన్ రూ.వెయ్యి మాత్రమే వస్తోందన్నారు. పరిశ్రమల్లో 30, 35 ఏళ్లు పని చేసిన ద్యోగులకు రూ.వెయ్యి పెన్షన్ మందులకు కూడా సరిపోవడం లేదన్నారు. పెన్షన్ పెంచాలని అనేక ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి కనీసం పెన్షన్ 3వేలు రూపాయలు కూడా ఇవ్వటానికి మనసు ఒప్పడం లేదన్నారు.

బుర్రిలంక ఆలయం వద్ద భారీ అన్నదానం

ప్రజాశక్తి-కడియం

మండలం బుర్రిలంకలో కనకదుర్గా దేవి అమ్మవారి ఆలయం చైర్మన్ చైర్మన్ కొత్తపల్లి వీరవెంట సత్యనారాయణ ఆధ్వర్యాన భారీ అన్నదానం నిర్వహించారు. మున్నంగి రామకృష్ణ శర్మ అధ్వర్యంలో గట్టి గోవింద్, సూర్య కుమారి, గట్టి పవన్ కుమార్, దివ్య దంపతులు కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

ఇసుక ర్యాంపులో అధిక వసూళ్లపై నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడి ఇసుక ర్యాంపులో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని రెండు రోజులుగా కార్మికులు, ట్రాక్టర్ల యజమానులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వంగలపూడి ఇసుక ర్యాంపులో వంటావార్పు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓపెన్ రీచ్ నిర్వహించడానికి పాన్ ఇండియా కంపెనీ టెండర్ దక్కించుకుందన్నారు. నదీగర్భం నుండి స్టాక్ పాయింట్‌కు ఇసుక తవ్వి, రవాణా చేయడానికి జట్టు కార్మికులకు రూ.200, ట్రాక్టర్‌కు రూ.150 ఇచ్చి, ఒక వారం రోజుల తర్వాత రేటు పెంచుతానని కాంట్రాక్టర్ చెప్పడంతో పని మొదలు పెట్టామన్నారు. చెప్పినట్టుగా కాంట్రాక్టర్ రేటు పెంచడం లేదన్నారు. అంతే కాకుండా ఓపెన్ రీచ్ లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం స్టాక్ పాయింట్ నుండి మెట్రిక్ టన్నుకు రూ.70 చొప్పున ఇసుక అమ్మకం జరపాలని, కాని మెట్రిక్ టన్నుకు రూ.300, దళారులకు రూ.100 చొప్పున అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. వంగలపూడి రీచ్ పాయింట్ ద్వారా కనీసం రోజుకు 2000 మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రతి సామాన్యుడికి అందుబాటులో ఉండేలా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చినా ఇసుక పాలసీని కొంతమంది అధికారులు, నాయకులతో కుమ్మక్కయ్యి కావాలనే ఇలా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

స్టాక్ పాయింట్‌కు వెళ్ళకుండా నిలిచిపోయిన ట్రాక్టర్లు

క్యాన్సర్ బాధితులకు మానవత సాయం

ప్రజాశక్తి-గోపాలపురం

వాదాలగుంటలో ఇద్దరు క్యాన్సర్ బాధితులకు మానవత సభ్యులు ఆదివారం రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. మానవత సభ్యులు మాట్లాడుతూ గొంతు క్యాన్సర్‌తో బాధ పడుతున్న మల్లిపూడి దుర్గారావు, థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న ప్రత్తిపాటి సత్యవతికి ఒక్కొక్కరికీ రూ.5,500 చొప్పున సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కమిటీ సభ్యులు ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత ధ్యేయమని, సభ్యులు ఇచ్చే సభ్యత్వాలతో అనేక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ గడా జోగేంద్ర ప్రసాద్, వడ్లమూడి రమేష్‌బాబు, కాకర్ల శ్రీరామ్, నున్న రవి కుమార్, రామేశ్వరపు హేమంత్, మల్లిపూడి సూర్య చంద్రం, కవులూరి శేషారావు, బొబ్బర రాజు, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావుకు సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

57వ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గోపాలపురం వరకట్న నిషేధంలో యువతీ యువకుల పాత్రపై డిబేట్ నిర్వహించినట్లు గ్రంథ పాలకులు వి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

నల్లజర్ల జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శాఖ గ్రంథాలయం నల్లజర్ల నందు ఉదయం కవి సమ్మేళనం, మధ్యాహ్నం క్విజ్ పోటీలు నిర్వహించారు గ్రంథాలయ అధికారి ఎవి.రమణ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం, చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి గుత్తికొండ కస్తూరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవి చెరుకూరి వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులకు గ్రంథాలయ రిసోర్స్ పర్సన్ పెరుమాళ్ల రామదాసు ఆధ్వర్యంలో చదరంగ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవి విఎస్‌వి.ప్రసాద్, కవయిత్రి పి.విజయలక్ష్మి, గుత్తికొండ స్రవంతి, ఐశెట్టి శ్రీనివాసు, వాణి పాల్గొన్నారు.

పెరవలి ముక్కామల, తీపర్రు, పెరవలి శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం 120 దేశాల నాణేలు, పోస్టల్ స్టాంపులను వాడపల్లి గ్రామానికి చెందిన అల్లు రామకృష్ణ ప్రదర్శించారు. ముక్కామల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మద్దిపాటి సత్యం రూ.25 వేల సౌండ్ సిస్టం గ్రంథాలయానికి బహుకరించారు ఈ కార్యక్రమంలో కడియాల సాయి, రామారావు, కరుటూరి విశ్వనాథం, కొంపెల్ల పట్టాభిరామం, ఎస్‌వివి.సూర్యనారాయణ, కవి కొండల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, సిహెచ్‌వి.విజయలక్ష్మి, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చాగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిహెచ్చఇ ఎంఎల్‌పిహెచ్ కె.రోసరి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సుమన్ కుమార్, ఇ.మణి, పి.ప్రియాంక, టి.కాంత కుమారి, ఎ.ముఖర్జీ పాల్గొన్నారు.

తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో కవుల జీవిత విశేషాలను తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకుడు నరేష్ పాల్గొన్నారు.

తాళ్లపూడిలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ఉండ్రాజవరంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రామ్మూర్తినాయుడుకు స్వర్ణాంధ్ర ఘన నివాళి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్వర్ణాంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు మరణం బాధాకరమని స్వర్ణాంధ్ర సభ్యులు విచాంం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో రామ్మూర్తి నాయుడు సంతాప సభలో స్వర్ణాంధ్ర అధ్యక్షులు రుంకాని వెంకటేశ్వరరావు మాట్లాడారు. రామ్మూర్తి నాయుడు గొప్ప స్నేహపాత్రుడని తెలిపారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ 1998లో సంస్థ స్థాపించిన నాటి నుంచి రామ్మూర్తి నాయుడు సంస్థ నిర్వహణకు ఎంతో సహకరించారని తెలిపారు. అనేకసార్లు స్వర్ణాంధ్ర సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఆర్థిక సహాయం కూడా అందించారని తెలిపారు. రామ్మూర్తి నాయుడు ఆశయాలను స్వర్ణాంధ్ర సేవా సంస్థ కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ఉపాధ్యక్షులు బొప్పర నాగేశ్వరరావు, కార్యదర్శి పివిఎస్.కృష్ణారావు, జి.గంగాధర్, హరికృష్ణ తదితరులు నివాళి అర్పించారు.

డిసెంబర్ నుంచి ముంబాయి, ఢిల్లీకి విమానాలు

ప్రజాశక్తి - కోరుకొండ

మధురపూడి విమానాశ్రయం నుండి ఢిల్లీ, ముంబాయిలకు వచ్చే నెల నుండి ఇండిగో సంస్థ ఎయిర్ బస్సులు నడపనున్నది. వచ్చే నెల 1వ తేదీ నుండి మధురపూడి విమానాశ్రయం నుండి దేశ ఆర్థిక రాజధాని ముంబాయికి, 12వ తేదీ నుండి దేశ రాజధాని ఢిల్లీకి డైరెక్ట్‌గా ఇండిగో సంస్థ ఎయిర్ బస్సు సర్వీసులను నడపనున్నది. ఈ సర్వీసులలో ఒక్కొక్క విమానంలోనూ 180 మంది ప్రయాణికులు ఒకేసారి ప్రయాణించవచ్చు. అదేవిధంగా వ్యాపారస్తులు, వివిధ చమురు సంస్థలలో పనిచేసే ఉద్యోగస్తులకు ఈ సర్వీసులు ఉపయోగపడతాయి. మధురపూడి విమానాశ్రయం నుండి ఉత్తర భారతదేశ యాత్రికులకు ఈ సర్వీసులు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి-బిక్కవోలు

శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి కాకినాడకు చెందిన రిటైర్డ్ డిఎల్‌పిఒ ఎర్రగుంట్ల విజయ జగన్నాథరావు గిరిజ దంపతులు రూ.20 వేల విరాళం అందించారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

షష్ఠి ఉత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి-బిక్కవోలు

సుప్రసిద్ధ బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలకు ఆదివారం ఉదయం పందిరి రాటతో అంకురార్పణ చేశారు. షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లె శ్రీనివాస్ రెడ్డి దంపతులు పందిరి రాట ఉత్సవాన్ని ఆలయ అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ శర్మ, సన్నిధిరాజు సుబ్రహ్మణ్య శర్మ నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బిక్కవోలు షష్ఠి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించుకున్నామని తెలిపారు. దేవాదాయ శాఖ వారు, పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేసి యాత్రికులకు వసతి భోజనం ఏర్పాట్లు చేస్తుననట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బేరా వేణమ్మ, త్రిమూర్తులు, చౌదరి, ఆలయ ఇఒ ఆకెళ్ల రామలింగ భాస్కర్. భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను అడ్డగించిన పోలీసులు

ప్రజాశక్తి-గోకవరం

గుమ్మళ్లదొడ్డి లో అస్సాగో ఈథైల్ ఆల్కహాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా జరిగిన దీక్ష, ఉద్యమంలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు ఆదివారం వెళుతున్న కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్‌ను వీర్లంకపల్లి జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. గ్రామాల్లో పర్యటించడానికి అనుమతి లేదని చెప్పారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ పోలీసులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి నారాయణరాజు, డాక్టర్ నక్కా సత్యనారాయణ, వేణు, కొండ శ్రీను, బొల్లం బాపిరాజు, మాసరపు అప్పారావు, ఏగుపాటి మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

కార్టూ'నిజం'



పంట మార్పిడితో చీడ పీడల నివారణ

'ప్రజాశక్తి'తో వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రైతులు ప్రతిసారీ ఒకే రకం పంటను సాగు చేస్తుండటంతో భూసారానికి ముప్పు వాటిల్లుతోంది. ముఖ్యంగా కొన్ని వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉండటంతో రైతులు అదే పంటను అదే పొలంలో ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. దీనివలన భూసారం క్షీణించడంతో పాటు చీడపీడలు విజృంభించడంతో రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. అందువల్ల పంట మార్పిడి చేసుకోవాలి' అని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. ఏరువులు, పురుగుల మందుల ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

పంటల మార్పిడి విధానం ఏ విధంగా మేలు..?

గత కొన్నేళ్లుగా పంట దిగుబడులు క్రమేపీ తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీనిని అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం మేలని రైతులకు సూచనలు ఇస్తున్నాం. దీనివలన భూసారం పెరిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చులు కూడా తగ్గుతాయి. రెండు మూడేళ్లకొకసారైనా పంట మార్పిడి చేస్తే చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించే చీడ పీడలు రెండో పంటను ఆశించవు. పంట మార్పిడి విధానంలో రెండు మూడు పంటలు పండించడం వల్ల ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు ధర దక్కకపోయినా ఇతర పంటల వల్ల తగిన లాభం పొందే అవకాశం ఉంటుంది. అంతే కాదు దిగుబడి కూడా పెంచుకోవచ్చు. రైతులందరూ ఒకే రకమైన పంట సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటోంది.

ఏ విధంగా పంటలను మార్పు చేయాలి..?

భూమిలో తక్కువ లోతుకు వేర్లు చొచ్చుకుపోయే పైరును, వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే పైర్లతో మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ, పోషకాలను మొక్కలు సమర్థంగా వినియోగించుకుంటాయి. పత్తి సాగు చేసిన పొలంలో మిరప పంట వేస్తే పురుగుల బెడద తగ్గుతుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మిరప సాగుకు ముందు భూమిలో జనుము, పిల్లిపెసర వంటివి సాగు చేసి, ట్రాక్టర్ ద్వారా తొక్కిస్తే భూసారం పెరిగి, చీడపీడలు దరి చేరవు. సుబీవులురుగులున్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. అవి వేస్తే పురుగులు మరింత వృద్ధి చెందుతాయి. నేలంతా పూర్తిగా కప్పే వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము వంటి పంటలనే పంట మార్పిడికి ఎంచు కోవా లి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.

తెగుళ్లు ఆశించకుండా ఉండాలంటే ఏం చేయాలి ?

వరి తర్వాత పప్పుధాన్యాలు లేదా నూనె గింజల పంటలు సాగు చేస్తే వరిని తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి. భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలు సాగు చేసుకోవచ్చు. కంది సాగు వల్ల ఆ పైరు ఆకులు రాలి కుళ్లడంతో నేలలో సేంద్రియ పదార్థం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది. వేరుశనగ, కంది, శనగ వంటి వాటి వేర్ల బుడిపెల్లో ప్రత్యేకమైన బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్థిరీకరించి, నేలను సారవంతం చేస్తుంది.

సమీకృత వ్యవసాయం ఎలా చేపట్టాలి..?

రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ శాస్త్రవేత్తలతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఒక ఎకరం భూమిలో ఫిష్ కల్చర్, వరి, కోళ్ల ఫామ్, కూరగాయలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మెట్ట ప్రాంతంలో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేసుకోవచ్చు. వరి పంట కాలం సుమారు 120 నుంచి 150 రోజులు. అదే చిరు ధాన్యాలు సాగు చేస్తే 30 రోజుల్లోనే పంట కాలం పూర్తవుతుంది. ఫలితంగా ఏడాదికి మూడు పంటలు వేసుకోవచ్చు. ఇలా ఎకరానికి పెట్టుబడి పోను రూ.50 వేల నుంచి రూ.60 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. అదే వరి సాగు చేస్తే రెండు సీజన్లు కలిపి రూ.25 వేలు మాత్రమే మిగులుతుంది. దీని దృష్టిలో ఉంచుకుని రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచిస్తున్నాం.



నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన వారిని కాకినాడ సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

42 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టణ, మండల పరిధిలోని ఆర్‌బి.కొత్తూరు, గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన దాడుల్లో 42 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కెవిఎస్.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో అక్రమంగా నిలవ చేసిన 14 మద్యం బాటిళ్లు, సారా తయారీకి ఉపయోగించే 90 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఇఎస్‌టిఎఫ్ కాకినాడ సిబ్బంది, పెద్దాపురం ఎక్సైజ్ సిబ్బంది, ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

రెండు రోజుల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడిన తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం గ్రామానికి చెందిన సనమండ్ర కమలేష్ అరెస్టు చేసి ఆదివారం నిడదవోలు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ కె.నరేందర్ తెలిపారు. మేజిస్ట్రేట్ నిందితుడికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. బాలిక సమిశ్రగూడెం హాస్టల్ నుంచి తీసుకువచ్చి చాగల్లు మండలం ధారవరంలో బంధువుల ఇంటికి తీసుకువెళ్లి నిందితుడు అత్యాచారం చేసినట్లు కేసు నమోదు చేశారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ కేసు నమోదైన 30 గంటల్లోపే నిందితుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కమిషనర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్ల ద్వారా వచ్చే సమస్యలను నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో నేరుగా ప్రజలు అందించే సమస్యల అర్జీలను స్వీకరిస్తామన్నారు. నగర ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఘనంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం గ్రామంలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో ఆదివారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైకుంఠపాళీ, కేరమ్స్, చదరంగం వంటి ఇన్ డోర్ గేమ్స్‌ను నిర్వహించారు. కథలు, చదువు విలువ కథను నాటికగా ప్రదర్శించారు. చిత్రలేఖనం, పాటలు, పద్యాలు, ఒరిగామి అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ అందజేశారు.

నిరుపేద కుటుంబాలకు ఆసరా

ప్రజాశక్తి - కరప

మండలం వేలంగి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు రూ.10 వేలు విలువ చేసే రేషన్, నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంజిఒ పేదలకు ఆయా సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసరా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు అలీం, సునంద, సుబ్రహ్మణ్యం, ఇమ్రాన్, దుర్గాదేవి, ప్రశాంత్, సుధాని పాల్గొన్నారు.

ఘనంగా కోత పండుగ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో దొరైర్ బి ప్రభాకర్, సంఘ కోశాధికారి టి.స్టాలిన్ ధర్మదాస్, పిసిసి, ఎల్‌సిసి ఆధ్వర్యంలో ఆదివారం కోత పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కోత పండుగ అంటే కృతజ్ఞత పండుగని, హృదయాల సమర్పణే నిజమైన కోత పండుగ అన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు ఎస్‌పి అభినందనలు

ప్రజాశక్తి - కాకినాడ

రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడలకు ఎంపికైన జిల్లా పోలీస్ కానిస్టేబుల్ పిల్లలను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అభినందించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ కె.రాజేష్ కుమారుడు ఒకతో తరగతి చదువుతున్న కె.హన్సిత్ రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభను చాటుకున్నాడు. అలాగే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్- 2 కానిస్టేబుల్ వి.వీరకృష్ణ కుమారుడు ఐదో తరగతి చదువుతున్న వి.వీరకృష్ రోలర్ స్కేటింగ్ నందు ప్రతిభ చూపిస్తున్నాడు. వీరిద్దరూ ఇటీవల జరిగిన పోటీల్లో పలు మెడల్స్‌ను సాధించారు. డిసెంబర్‌లో కర్ణాటక రాష్ట్రంలోను మైసూరులో జరుగబోవు 62వ జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరుపున అండర్-11 విభాగంలో ఎంపికైన వీరిని ఎస్‌పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్‌లో రాణిస్తున్న కానిస్టేబుల్ పిల్లలకు పోలీసు శాఖ యొక్క సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఆదివారం పలు చోట్ల కార్తీక వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. పలు చోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

కొత్తపేట: శెట్టి బలిజలు అంతా ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ,టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. కొత్తపేట ఆర్ఎస్ కళ్యాణ మండపం వద్ద శెట్టిబలిజ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా టిడిపి అధ్యక్షులు రెడ్డి అనంత కుమారి దంపతులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిమంది వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్నసమారాధనను స్వీకరించారు. మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కముజు వెంకటేశ్వరరావు, గుబ్బల సత్తిపండు, రెడ్డి రామకృష్ణ, రెడ్డి చంటి, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.**కపిలేశ్వరపురం:** ఐకమత్యానికి ప్రతీకలుగా కార్తీక వన సమారాధన నిలుస్తాయని ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ లు అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణ లో కపిలేశ్వరపురం గ్రామ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తొలుత సంఘ పెద్దలు కుటుంబ సమేతంగా ఉసిరి చెట్టుకి పూజలు నిర్వహించి, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, దుర్గారావు, గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, మండపేట మునిసిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వర ప్రకాష్ , శెట్టిబలిజ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయ బాబు , ఎంపిటిసిలు శీలం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ఆర్ఎస్ కళ్యాణ మండపం వద్ద జరిగిన వనసమారాధనలో మంత్రి సుభాష్

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా కేంద్రం అమలాపురంలో వివేకానంద సేవాసమితి నేతృత్వంలో వివేకానంద యువత , అఖిల భారత విద్యార్థి పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షులు గొవ్వాల నాగరాజు అధ్యక్షతన పట్టణంలోని స్థానిక సర్ సివి రామన్ పబ్లిక్ స్కూల్ నందు ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ వ్యాఖ్యాత పి.రవికుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు ఆకుల రవితేజ, పండితుడు ఆ కొండి పవన్, ఎస్.ఎం డిసి, సిజిఎమ్ శేఖర్, ఆర్థోపెడిక్ డాక్టర్ కొప్పిసెట్టి రమణ తదితరులు వేలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు శిక్షణకు సంబంధించిన ధ్రువ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్ సివి రామన్ విద్యా సంస్థల అధినేత రమణ వేణు, అఖిల భారత విద్యార్థి పరిషత్ సభ్యులు అంజని శ్రీనివాస్, నేదునూరి యువత సభ్యులు కృష్ణ, వివేకానంద సేవ సమితి సభ్యులు పెద్దాపురం సివి అంకబాబు, పేరి లక్ష్మీ నరసింహం, పేరి లలిత, అజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగ సుధా కొండ, అధిక సంఖ్యలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న సివి రామన్ పాఠశాల అధినేత రమణ వేణు

వరద ముంపు గ్రామాలకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో 10 వరద ముంపు గ్రామపంచాయతీలకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు చేతులమీదుగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయములో ఆదివారం ఆయా గ్రామాల సర్పంచ్ లకు చెక్కులు అందజేశారు. ఒక్కొక్క పంచాయతీకి రూ.50 వేల వంతున చెక్కులు అందజేశారు పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడి లంక, పెదపట్నం, నాగుల్లంక, ఎల్.గన్నవరం, మొండెపులంక, కె.పెదపూడి, ఊడిమూడి గ్రామ పంచాయతీలకు చెక్కులు అందజేశారు. బి దొడ్డవరం పంచాయతీకి తదుపరి జాబితాలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లు సుందర్శిస్తి రాజేష్‌కుమార్, గెడ్డం మంగాలక్ష్మి కొనుకు ప్రేమజ్యోతి, గుబ్బల దుర్గ, యెల్లమెల్లి కృష్ణవేణి, పసలపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు

రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం

ప్రజాశక్తి - యంత్రాంగం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు మృతికి పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆదివారం ఘన నివాళులు అర్పించారు. **అమలాపురం:** నారా రామ్మూర్తి నాయుడు మృతికి అమలాపురం టిడిపి నేతల ఆధ్వర్యంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ స్వగృహం వద్ద టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** సిఎం నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు ఆకాల మరణం విచారకరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ద్రాక్షారామంలో సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి సుభాష్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. నారా రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. **కొత్తపేట:** మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు మరణం చాలా బాధాకరం అని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం కార్యాలయం వద్ద రామ్మూర్తి నాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బులితాత, ముత్యాల బాబ్జీ, బండారు సందీప్, చిక్కం హనుమంతరావు, బండారు రాజేష్,కడియం చిన్నరెడ్డి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద టిడిపి నేతల నివాళి

దాతను సత్కరిస్తున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు కడియం వాసులు మదరువు శ్రీనివాస్ వరలక్ష్మీ దంపతులు మరియు జస్వంత్ ఆదివారం రూ. లక్ష విరాళం ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

కాపు వన సమారాధన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొత్తపేట

తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని బండారు బులిసత్తు, చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో ఈ నెల 24న నిర్వహించనున్న కాపు వన సమారాధన ఆహ్వాన పత్రికను స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 24న జరిగే వన సమారాధనకి అత్యధిక సంఖ్యలో సోదర, సోదరీమణులు పాల్గొనాలని కోరారు.

మూలేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంఎల్ఎ బండారు

ఆలమూరు: మండలంలోని మూలస్థానంలో ఉన్న పార్వతీ మూలేశ్వరస్వామి ఆలయానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పార్టీ శ్రేణులతో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవంలో స్వామి వారిని దర్శించుకుని సత్యానందరావుకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు.

మెస్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

వేతన బకాయిలు చెల్లించాలని కాకినాడ జిజి హెచ్ మెస్ కార్మికులు కోరారు. ఆదివారం స్థానిక జిజిహెచ్‌లో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ నెలలో సగం రోజులు గడిచినా సెప్టెంబర్, అక్టోబరు నెలల జీతాలు, ఏడు నెలల పిఎఫ్, ఇఎస్ఐ సొమ్ము కాంట్రాక్టర్ ఇవ్వలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టరుకు సమస్యను తెలియజేసినా ఎటువంటి స్పందన లేకుండా పోయిందన్నారు. అందుకు దశల వారి పోరాటం చేయాలని ఈ సమావేశంలో కార్మికులు తీర్మానించినట్లు నాయకులు తెలిపారు. ఈ విషయమై అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు మలక వెంకటరమణ కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - ఆలమూరు

సిపిఐ, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సంయుక్త పిలుపు మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను 3 సెంట్లుగా మార్పు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇంతవరకు ఇంటి స్థలం లేనివారికి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల శాఖ బికెఎంయు ఆధ్వర్యంలో స్థానిక సమత ఆఫీసు వద్ద ఆదివారం దరఖాస్తులు పూర్తి చేశారు. ఈ దరఖాస్తుదారులను ఈనెల 18న ఆలమూరు సచివాలయం నందు దరఖాస్తులు అందజేయడానికి తరలి రావాల్సిందిగా వారు లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ శ్యామ్, సిపిఐ ఆలమూరు శాఖ కోశాధికారి వరలక్ష్మి , మాజీ ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆనంద్, దేవరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సైపుల్లా సేవలు అభినందనీయమని సామర్ల కోట ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య కొని యాడారు. ఆదివారం యుటిఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సయ్యద్ సైపుల్లాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక అగస్త్యా మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఎస్‌జిటిగా పనిచేస్తున్న సయ్యద్ సైపుల్లాకు రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడం సామర్లకోట మండలానికే గర్వకారణమన్నారు. విద్యార్థులకు ఉర్దూ మీడియంలో పాఠ్యాంశాలు బోధించడానికి పాఠ్యపుస్తకాలు తానే తెచ్చుకుని ఎంతో నిబద్ధత పని చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం టి.శ్యాంసుందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు వై.ప్రభాకర్, బి.మోహన్‌రావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బుల్లబ్బాయి పి.గిరిధర్ గోపాలరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు సేవా సంస్థల సాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

చికిత్స నిమిత్తం బాధితులకు పలు సేవా సంస్థల సభ్యులు ఆర్థిక సాయం అందించారు.వివరాలు ఇవి..

పి.గన్నవరం: మండలంలోని పితాని వారి పాలెంకు చెందిన కడలి దుర్గారావు కుమారుడు రోహిత్ ఆర్థిక నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి గ్రూప్ సభ్యులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, నాయకులు విత్తనాల ప్రభాకర్, గ్రామ సర్పంచ్ కుడుపూడి లక్ష్మణ రావు, పితాని నరేంద్ర, వాకలపల్లి చిన్నకడలి సారథి, కడలి రాంబాబు, మరియు సంస్థ సభ్యులు గుబ్బల గోవర్ధన పద్మ కుమార, కడలి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** ఇటీవల సౌదీ దేశంలో తలకు తీవ్రగాయమై వైద్యం చేయించుకుంటున్న ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితునికి మనం ట్రస్ట్ చేయూత అందించింది. మండల పరిధి పొడగట్లపల్లికి చెందిన సానబోయిన సాయి సౌదీదేశంలో తీవ్ర గాయాలయ్యాయని వైద్యం కూడా ఎదురు చూస్తున్నారనే సమాచారం మనం ట్రస్ట్ ఇంచార్జ్ గండ్రోతు దుర్గాదేవి తెలుసుకున్నారు. బాధితుని గోన్నే సందర్శించి దాతలు సహకారంతో నగదు రూ.41వేలు పిఆర్ టిటి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధితుని తమ వంతు గా సహకారం అందించిన దాతలు సహకారంతో ట్రస్ట్ ఇంచార్జ్ దుర్గాదేవి కృతజ్ఞతలు తెలియచేసారు. బాధితుని వైద్యం నిమిత్తం దాతలు సహరించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పితానివారిపాలెంలో 'గల్ఫ్ యువనేస్తం' ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

పొడగట్లపల్లిలో బాధితునికి మనం ట్రస్ట్ ఆర్థిక సాయం

ఐదు వేల మందికి ప్రసాద వితరణ

ప్రజాశక్తి - కె. గంగవరం

కార్తీక మాసం సందర్భంగా ద్రాక్షారామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వచ్చిన ఐదు వేల మంది యాత్రికులకు పూర్వ విద్యార్థులు ప్రసాద వితరణ చేశారు. 1988-89 టెన్త్ క్లాస్ ఎస్‌వీబీఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థిని, విద్యార్థుల ఆధ్వర్యంలో ఉదయం ప్రసాదం ఐదు వేలమందికి వితరణ చేశామని ఏపీ బి డిసి మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తెలిపారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వసంశెట్టి రంగనాయకులు, తుమ్మూరి రాంబాబు, చిక్కాల నాగబాబు, వాసంశెట్టి బాపూజీ, ఈత రాంబాబు, కొండమూరు సూరిబాబు, సల్మాన్ హుస్సేన్, గోదవర్తి సాయి, దేగల రమేష్, దాసరి పెరుమాళ్ళు, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు ప్రసాద వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రకటన

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నియోజకవర్గం, అల్లవరం మండలం గుండెపూడి గ్రామం పోతులవారి పేట వాస్తవ్యుడు విప్పర్తి నవీన్ అను నేను ప్రకటించునది ఏమనగా, విప్పర్తి నవీన్ అను నాకు నా భార్య శ్రీజ లకు పుట్టిన నా కుమారుడు జనన నా గ్రామ పంచాయతీలో నమోదు కాలేదు. నా కుమారుడు విప్పర్తి హర్షవర్ధన్ 22-12-2021 న జన్మించారు. పరిశీలన విషయం అభ్యంతరాలు ఏదేని ఉంటే పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: విప్పర్తి నవీన్
S/o. విప్పర్తి రామారావు, డోర్ నంబర్ 2-24
గుండెపూడి, పోతుల వారి పేట,
అల్లవరం మండలం, Pin-533217,
సెల్ నెంబర్: 9177286540